

నయనానందం..భక్తిరస రమ్యం
కొనకనమిట్ల మండలం వెలుగొండలో వెలసిన వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. - 8లో..



ఇక ఆటవిడుపు
ఇంటర్మీడియెట్ సెకండియర్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. దీంతో విద్యార్థులు కొండంత బరువు దిగిపోయిందంటూ ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
41/27

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి చలిగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

ఆదివారం	ఇఫ్తార్
సాయంత్రం	గం 6 : 29
సోమవారం	సహారి
ఉదయం	గం 4 : 58

న్యూస్‌రీల్

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడద్దు


- జీరో వేస్ట్ మార్కెట్లను ఆవిష్కరించాలి
- స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా



పార్కును ప్రారంభిస్తున్న కలెక్టర్

ఒంగోలు సబర్బన్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వినియోగించకుండా ప్రజలందరూ తమ వంతు బాధ్యత వహించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు జీరో వేస్ట్ మార్కెట్ల ఆవిష్కరణ దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజలందరూ సహకరించాలని ఆమె కోరారు. «స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర» కార్యక్రమంలో ప్రతినెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛత దివస్ లో భాగంగా ఒంగోలు నగరంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ గంగాడ సుజాత లతో కలిసి ఆమె పాల్గొన్నారు. తొలుత దక్షిణ బైపాస్ రోడ్డులోని జిల్లా ట్రెజరీ కార్యాలయం సమీపంలో జాతీయ రహదారి వెంట మొక్కలు నాటారు. అనంతరం పీటీసీ రోడ్డులోని ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏబీసీ సెంటర్ ప్రాంగణంలో వ్యర్థాలతో రూపొందించిన పార్కును కలెక్టర్ ప్రారంభించారు. ఆ ప్రాంగణం మొత్తాన్ని కలియతిరిగి ఆసక్తిగా పరిశీలించారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ చేస్తున్న విధానాన్ని వైద్యుల ద్వారా తెలుసుకున్నారు. చివరగా కొత్త కూరగాయల మార్కెట్లో మెప్మా మహిళలకు నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి వస్త్రంతో, జూట్ తో చేసిన సంచుల వినియోగాన్ని పెంచేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి జీరో వేస్ట్ మార్కెట్లుగా వాటిని తీర్చి దిద్దడంపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. అనంతరం మెప్మా మహిళలకు, మార్కెట్లో సరుకులు కొనుగోలు కోసం వచ్చిన ప్రజలకు జూట్, వస్త్రంతో చేసిన బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, మెప్మా పీడీ శ్రీహరి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ధర పండక



కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నదాతకు కష్టకాలం దాపురించింది. ఒక పక్క వర్షాభావం, మరో పక్క అకాల వర్షాలు రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఫలితంగా సాగు విస్తీర్ణం తగ్గింది. దిగుబడులూ తగ్గాయి. ఉత్పత్తులు తగ్గినప్పుడు సాధారణంగా మార్కెట్లో అనుకున్న ధరలు రావాలి. అందుకు భిన్నంగా ధరలు పతనమయ్యాయి. మిర్చి, పత్తి, శనగ, ధాన్యం ఇలా అన్ని పంటల ధరలు నేలచూపు చూస్తున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో పుష్కలంగా పంటలు పండటంతో పాటు రైతు భరోసా డబ్బు రైతుకు కొండంత అండగా నిలిచింది. ఒకరకంగా రైతులకు స్వర్ణయుగం అని చెప్పాలి. తర్వాత ప్రభుత్వం మారింది. మళ్లీ రైతులకు కష్టాలు మొదలయ్యాయి. 2024 ఎన్నికల సమయంలో రైతులకు ఆర్థిక సాయం అందిస్తామని నమ్మబలికిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఎప్పటిలాగే మొండిచేయి చూపించారు.

- తగ్గిన పంటల దిగుబడులు
- మార్కెట్లో ధరలు లేక అల్లాడుతున్న రైతులు
- ధాన్యం, మినుము, కంది, మిర్చి, శనగ తదితర పంటలకు గిట్టుబాటు ధరలు లేవు
- దయనీయంగా మారిన మిర్చి రైతు పరిస్థితి
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మిర్చి క్వింటా రూ.18 వేల నుంచి రూ.25 వేలు
- కూటమి ప్రభుత్వ హయాంలో రూ.6 వేలు కూడా రాని వైనం
- రైతు కష్టాలు పట్టని ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో మొత్తం 40 వేల హెక్టార్లలో ధాన్యం సాగుచేయాల్సి ఉంది. అయితే వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో 23 వేల హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టారు. హెక్టారుకు 3.4 నుంచి 4 మెట్రిక్ టన్నుల చొప్పున ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ లెక్కన సుమారు 90 వేల నుంచి లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తున్నట్లు అంచనా. రైతుల సొంత అవసరాలు.. స్థానిక అవసరాలకు కలుపుకుని సగానికి అవసరం అనుకున్నా 50 వేల మెట్రిక్ టన్నులుపోను మిగతా 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి రైతుల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్‌లో కేవలం 5 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించి కొనుగోలు చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగా ఏర్పాటు చేయటంతో దళారులు బాహాటంగానే దోపిడీకి పాల్పడుతున్నారు. మద్దతు ధర్‌పై బస్తాకు రూ.500 నుంచి రూ.600 వరకు తక్కువ ధర ఇస్తున్నారు. వడ్లకు మార్కెట్లో డిమాండ్ లేదు. రోజులు గడిచేకొద్దీ ధాన్యాన్ని అడిగేవారు ఉండరని దళారులు రైతులను బెదిరిస్తున్నారు. వీరి మాటలు నమ్మి విక్రయించేందుకు వెళితే 'మట్టి తేమశాతం ఎక్కువగా ఉందని.. బియ్యం విరుగుతూ ఉన్నాయి' అంటూ సాకులు చూపించి భయపెడుతున్నారు. ఐదు నుంచి ఆరు కిలోల వరకు తరుగు రూపంలో అదనంగా లాగేస్తూ మోసాలకు తెగబడుతున్నారు. ఈ దందా విచ్చలవిడిగా జరుగుతున్నా రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు, బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారు.

బాహాటంగానే దోపిడీ...

గ్రేడ్–ఏ రకానికి రూ.2,320 ఇవ్వనుండగా కామన్ ధాన్యం రకానికి రూ.2,300 ఇస్తోంది. ఈ ధరకు రైతుల వద్ద ఉన్న ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తే రైతులు అప్పుల నుంచి కనీసం బయటపడతారు. అలాంటిది రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవటంతో దళారులు కళ్లాల్లోనే అతి తక్కువ ధరకు కొనుగోలు చేసుకుపోతున్నారు. రైతులు చేసేది లేక క్వింటా ధాన్యం రూ.1500 నుంచి రూ.1800 తెగనమ్ముకోవాల్సిన పరిస్థితిని చంద్రబాబు ప్రభుత్వం కల్పిస్తోంది. అంటే రైతు ప్రతి క్వింటాకు రూ.500 మేర తీవ్రంగా నష్టపోతున్నాడు.

జిల్లాలో గత ఆరేళ్లలో ప్రధాన పంటల సాగు వివరాలు (హెక్టార్లలో) ఖరీఫ్, రబీ సీజన్లు కలుపుకుని...

సంవత్సరం	వరి	శనగ	మినుము	కంది	మిర్చి
2019–20	65,130	86,180	12,368	94,791	39,564
2020–21	88,346	92,410	62,707	81,903	36,885
2021–22	69,061	1,00,935	46,398	80,712	41,250
2022–23	26,523	40,448	27,109	59,087	39,600
2023–24	15,652	35,302	15,426	67,569	29,650
2024–25	23,000	24,588	12,32	71,665	26,163

సంవత్సరాల వారీగా పంటల దిగుబడులు (మెట్రిక్ టన్నుల్లో)

సంవత్సరం	వరి	శనగ	మినుము	కంది	మిర్చి
2019–20	4,31,495	1,11,170	11,340	48,874	2,76,948
2020–21	4,75,788	1,22,834	21,141	35,115	2,39,752
2021–22	5,53,345	1,76,000	61,075	99,750	2,88,750
2022–23	1,49,541	65,233	17,628	11,094	2,77,200
2023–24	61,324	48,117	10,826	26,676	1,77,900
2024–25	90,000	60,826	14,500	72,400	15,7692

ప్రధాన పంటకు మద్దతు ధరలు, మార్కెట్‌లో హెచ్చుతగ్గులు ఇలా...

కందులు :

- ప్రభుత్వం అందించే మద్దతు ధర రూ.7,750
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బయట మార్కెట్ ధర రూ.11 వేల నుంచి రూ.11,500 వరకు పలికింది
- ఈ ఏడాది బయట మార్కెట్‌లో రూ.7 వేల నుంచి రూ.7,100 మాత్రమే ఉంది.
- ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు.

మినుములు :

- ప్రభుత్వం అందించే మద్దతు ధర రూ.7,400
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బయట మార్కెట్ ధర రూ.12 వేల వరకు పలికింది
- ఈ ఏడాది బయట మార్కెట్‌లో రూ.7,500 నుంచి రూ.8 వేల వరకు ఉంది.
- ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో పంట వివరాలు నమోదు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఇంకా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు.

శనగలు :

- ప్రస్తుతం ప్రభుత్వం అందించే మద్దతు ధర రూ.5,650
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్వింటా రకాన్ని బట్టి రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు ధర పలికింది.
- 2014–19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో శనగకు ధర లేక రైతులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచుకున్నారు. దాంతో పెట్టుబడి రాక రైతులు బాగా నష్టపోయారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉన్న శనగలకు క్వింటాకు రూ.1,500 అదనపు ధర ఇచ్చి రైతులను ఆదుకున్నారు. దాంతో జిల్లాలోని రైతాంగానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నుంచి దాదాపు రూ.150 కోట్ల వరకు ప్రయోజనం చేకూరింది.
- ఈ సంవత్సరం కూటమి ప్రభుత్వంలో ప్రస్తుత ధర బయట మార్కెట్‌లో కేవలం రూ.5 వేల నుంచి రూ.5,300 వరకు మాత్రమే ఉంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెట్టుబడులు కూడా రావని దిగులు పడుతున్నారు.

మిర్చి

మిర్చి రైతు కంట్లో కారం పడుతోంది. మార్కెట్లో గిట్టుబాటు ధర లభించక అల్లాడిపోతున్నారు. గుంటూరు యార్డులోనే క్వింటా ధర రకాన్ని బట్టి రూ.10 వేల నుంచి రూ.11 వేల మధ్య పలుకుతోంది.

- జిల్లాలో మిర్చి కొనుగోలు కేంద్రం లేకపోవడంతో గుంటూరు వెళ్లి మిర్చి యార్డులో అమ్ముకోవాల్సిన పరిస్థితి.
- ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి క్వింటా మిర్చిని రూ.11,740కి కొనుగోలు చేయిస్తానని రైతులను నమ్మబలికాడు. చంద్రబాబు ఢిల్లీపోనూ పోతున్నాడు..రానూ వస్తున్నాడు. కానీ, మిర్చి రైతులకు కళ్లల్లో మాత్రం కారం కొడుతున్నాడు. ఇప్పటి వరకు ఆ ఊసే లేదు.
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో క్వింటా మిర్చి రూ.18 వేల నుంచి రూ.25 వేల వరకు వెళ్లింది. దాంతో మిర్చి రైతులు లాభాల బాట పట్టారు. మళ్లీ జీవితంలో ఆ పరిస్థితులను చూడలేమనుకుంటూ రైతులు నిట్టూరుస్తున్నారు.

శనగ సాగు అంటేనే భయంగా ఉంది



ఈ ఏడాది శనగ పంట అదును సమయంలో తీవ్రమైన వర్షాలతో పంట కాలం కొంత లేటైనప్పటికీ గతేడాది ఉన్న మార్కెట్ ఆశతో ఈ ఏడాది కూడా 10 ఎకరాల వరకు శనగ పంట సాగు చేశా. అయితే, గతేడాది పంట చేతికొచ్చే సమయానికి కాక్–2 రకం శనగలకు సుమారు 10 వేల రూపాయల వరకు రేటు ఉంటే.. ఈ ఏడాది ఇదే రకం శనగకు కేవలం కేవలం రూ.6,800 మాత్రమే ఉంది. జేజే శనగలకు ప్రస్తుతం రూ.5 వేల కంటే ఎక్కువ అడిగే పరిస్థితి కనిపించడం లేదు. పోయిన ఏడాది ఇదే సమయంలో జేజేలను రూ.6,700కు అమ్ముకున్నాము. పంట దిగుబడి కూడా అంత ఆశాజనకంగా లేదు. శనగ సాగు అంటేనే భయంగా ఉంది.

– వెంకటేశ్వర్లు, శనగ రైతు, ఈదుమూడి

తీవ్రమైన నష్టాలు చూడాల్సి వస్తోంది



పెరిగిన ఖర్చులతో పంటలు పండించాలంటేనే భయంగా ఉంది. తీరా పంట చేతికొచ్చే సమయానికి అమ్ముకుందామంటే మార్కెట్ కోత పెట్టి దళారులు కొంటున్నారు. శనగ రైతుల మేలు కోరి గతేడాది ఇదే సమయానికి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనగ రైతులకు అదనంగా రూ.1,500 మద్దతు ధర ఇచ్చారు. దీని వలన శనగ రైతులకు చాలా ప్రయోజనకరంగా మారింది. ప్రస్తుతం పంటలు అమ్ముకోవాలంటే తీవ్రమైన నష్టాలను చూడాల్సి వస్తోంది.

– అలవల చెంచారెడ్డి, రైతు

'కంది'గింజంత లాభంలేదు



కందిగింజంత లాభం కూడా ఈఏడాది లేదు. పెట్టిన పెట్టుబడి ఎక్కువైంది. కౌలు ధరలు, ఎరువులు, పురుగుమందుల ధరలు ఆకాశాన్నంటాయి. వాతావరణం సరిగాలేక ఈఏడాది దిగుబడి ఎకరాకు కేవలం 2–3 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. పెట్టుబడి ఎకరాకు రూ.20 వేలకు పైగా అయింది. గిట్టుబాటు ధర కూడా లేకపోవటంతో నష్టాలు వచ్చాయి. ప్రైవేటు వ్యక్తులు క్వింటాలు రూ.6700 కు మించి కొనటంలేదు. కొనుగోలు కేంద్రం క్వింటాలు రూ.7550 ఉంది. ప్రభుత్వం ఆదుకోకపోగా గిట్టుబాటు ధర కూడా ఇవ్వలేదు.

– కోటేశ్వరరావు, రైతు, ఎస్ఎస్‌పీ అగ్రహారం

ధరలు మరీ దారుణం



నాలుగు ఎకరాల్లో నెల్లూరు జీలకర రకం వరి సాగు చేశాను. 75 కేజీల బస్తా రూ.1400 కొంటున్నారు. అందులో 3 కేజీలు తరుగు, రూ.50 రవాణా ఖర్చులు, కమీషన్ రూ.20, గోతాం ఖర్చు ఒక కేజీ ఈ లెక్కన సుమారు రూ.160 పోను చివరికి రూ.1240 చేతికి వస్తాయి. ఈ డబ్బులు కూడా ఎప్పుడు ఇస్తారో అర్థం కావడం లేదు.

– తుమ్మకూరి యానాది, రైతు, బింగినపల్లి, సింగరాయకొండ మండలం

అక్రమాలకు పాల్పడితే ఎవరినీ క్షమించం

- ఎంపీడీఓ చేసిన అవినీతిపై ప్రశ్నిస్తామన్న భయం ఉంది
- ఆ భయంతోనే సమావేశాలకు రాకుండా పారిపోతున్నారు
- కొందరు నాయకులకు తొత్తులా పని చేస్తున్నారు
- ఇన్‌చార్జి ఎంపీడీఓ తీరుపై ఎమ్మెల్యే తాటిపర్తి మండిపాటు
- మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన

పెద్దదోర్నాల:

తాను సర్వసభ్య సమావేశానికి హాజరైతే ఎక్కడ అతను చేసిన అవినీతి బయటకు వస్తుందోనన్న భయంతోనే మండల సర్వ సభ్య సమావేశాన్ని వాయిదాలు వేస్తున్నారని పెద్దదోర్నాల ఇన్‌చార్జి ఎంపీడీఓ నాసర్‌రెడ్డి తీరుపై యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జరగాల్సిన సర్వ సభ్య సమావేశాన్ని ప్రజా ప్రతినిధులు హాజరు కాలేదన్న కారణంతో వాయిదా వేసుకుని ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్న ఇన్‌చార్జి ఎంపీడీఓపై ఎమ్మెల్యే మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మూడు సమావేశాలను ఏ అధికారులు పాల్గొనకుండా, శాసన సభ్యుడైన తనకు కూడా సమాచారం ఇవ్వకుండా నిర్వహించారని విమర్శించారు. ఒక వేళ సమాచారం తెలుసుకొని సమావేశానికి వచ్చేందుకు సిద్ధపడితే మళ్లీ ఆ సమావేశాన్ని రద్దు చేస్తారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ జరుగుతున్నప్పుడు 13వ తేదీ సమావేశం ఉందని సమాచారం ఇచ్చారని, అయితే తాను వస్తున్నానన్న నెపంతో దాన్ని 15 తేదీకి వాయిదా వేశారన్నారు. అయితే 15 తేదీ రాగానే మళ్లీ స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి పిలుపునిచ్చి మండల సమావేశాన్ని ఏఓ నిర్వహించాలని బాధ్యతలు అప్పజెప్పారన్నారు. ఏ అధికారం లేని తెలుగుదేశం ఇన్‌చార్జి చుట్టూ తిరుగుతున్న ఎంపీడీఓ 11 గంటలకు సమావేశం అని ప్రకటించి, అందరూ ఎంపీడీఓ వస్తే సమావేశానికి వెళ్లాలని వేచి చూస్తున్న తరుణంలో మీటింగ్ హాల్ లోకి రాకుండా కోరం లేదంటూ పారిపోయాడని ఎద్దేవా చేశారు. అసలు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శిదన్నారు. అలాంటప్పుడు ఇన్‌చార్జి ఎంపీడీఓకు స్వచ్ఛ భారత్‌తో పనేంటని ప్రశ్నించారు. ఒక వేళ స్వచ్ఛ భారత్‌లో తాను పాల్గొనదల్చినప్పుడు మండల సర్వ సభ్య సమావేశం ఉందని ఎందుకు ప్రకటించారని అన్నారు. ఈఓపీఆర్డీగా ఉన్న ఈ ఇన్‌చార్జి ఎంపీడీఓ రూ.25 లక్షలు ఎలా డ్రా చేయగలుగుతున్నాడని ఆయన ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ నాయకులతో లాలూచీ పడి నిధులను వారికి దోచి పెడ్తున్నారన్నారు. ఈ సమావేశానికి వస్తే దోచుకున్న నిధులకు ఎక్కడ లెక్కలు చెప్పాల్సి వస్తుందోనన్న భయంతోనే సమావేశాలు వాయిదా వేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ఇటువంటి అధికారుల చర్యలను కలెక్టర్, పంచాయతీ రాజ్ శాఖా మంత్రి పవన్ కళ్యాణ్‌లు తీవ్రంగా ఖండించాలన్నారు. ఈ ఎంపీడీఓ సభను నిర్వహించడు...శాసన సభ్యులంటే గౌరవం లేదు... స్థానిక సమస్యలపై అవగాహన అసలే లేదన్నారు. మండలంలో ఉన్న వ్యవస్థలను నిర్వీర్యం చేయటంలో సిద్ధహస్తుడీ ఎంపీడీఓ అని విమర్శించారు. అధికారంలేని వ్యక్తులతో కలిసి ప్రజాదర్బార్ నిర్వహించటం ఒక్కటే ఇతనికి తెలిసిన విద్య అన్నారు. ఎండీడీఓ నిర్లక్ష్య వైఖరిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత జెడ్పీ సీఈఓ, కలెక్టర్‌లపై ఉందన్నారు. ఒక దళిత ఎమ్మెల్యేను అవమానపర్చటం... వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారికి పని చేయకపోవటం ఇదేనా వీరి విధానం అంటూ ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ నాసర్‌రెడ్డి తీరును విమర్శిస్తూ కార్యాలయం బయట ఎంపీపీ, ఎంపీటీసీ, కోఆప్షన్‌సభ్యులు, పంచాయతీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఎంపీడీవో డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి ఎంపీపీ గుమ్మా పద్మజ యల్లేష్, జడ్పీటీసీ సభ్యురాలు లతా చంద్రకాంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీటీసీ సభ్యులు, నాయకులతో కలిసి ఆందోళన చేస్తున్న ఎమ్మెల్యే

వెలిగొండ నిర్వాసితులకు ప్యాకేజీ అందజేయండి

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతి పత్రం అందచేశారు. గెజిట్ నోటిఫికేషన్‌లో ఉన్న జాబితా ప్రకారం వరుస క్రమంలో పరిహారం ఇవ్వాలని, గెజిట్‌లో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్యాకేజీ మంజూరు చేయాలని, ముంపు గ్రామాల పునరావాస కాలనీలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు, అర్హత ఉండి సర్వేలో మిస్సింగ్ అయిన కుటుంబాలకు గెజిట్‌లో చేర్చాలని ఆయన కోరారు. 2,996 కుటుంబాలకు గాను 2,148 మందికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ మంజూరయ్యాయని, మిగిలిన 848 కుటుంబాలకు పీడీఎఫ్ పెండింగ్ అవార్డులు పూర్తిచేయాలని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, నష్టపరిహారం పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి ప్రాధాన్యత వరుస క్రమంలో ఇవ్వాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లో కొత్త రోడ్లు మంజూరు చేయాలని మరో వినతి పత్రంలో ఆయన కోరారు. యర్రగొండపాలెం నుంచి దుర్గి వెళ్లేందుకు 10 కిలో మీటర్ల రోడ్డు, యర్రగొండపాలెం నుంచి పుల్లలచెరువు వెళ్లేందుకు 10.5 కిలోమీటర్ల పొడవున్న రోడ్లను మంజూరు చేయాలన్నారు. యర్రగొండపాలెం నుంచి త్రిపురాంతకం వెళ్లే రోడ్డు నిర్మాణాన్ని చేపట్టి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ రోడ్డు గత ప్రభుత్వ కాలంలో మంజూరైందని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలన పనులు చేపట్టకుండా కాలయాన చేస్తున్నాడని, పుణ్యక్షేత్రమైన త్రిపురాంతకం వెళ్లే భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన కలెక్టర్‌కు వివరించారు.



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతి పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

బాలినేని ఇంతలా దిగజారి మాట్లాడాలా?

- ఎక్స్‌లో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ట్వీట్



టంగుటూరు:

బాలినేని శ్రీనివాసరెడ్డి రాజకీయాల కోసం ఇంతలా దిగజారి మాట్లాడాలా అని మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్ శనివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి దయవల్ల రాజకీయాల్లో పదవులు అనుభవించి ఇప్పుడు ఆయన కుమారుడు జగనన్న అస్తిత్వాన్ని ప్రశ్నిస్తావా..నీ అస్తిత్వం ఎక్కడో ఒక్కసారి ప్రశ్నించుకో.. వైవీ సుబ్బారెడ్డి బావమ్మర్దిగా రాజశేఖరరెడ్డి కుటుంబానికి దగ్గరయ్యావు తప్ప లేకుంటే నీ అస్తిత్వం ఏంటో నీకు తెలీదా... నీ ప్రాణం ఉన్నంత వరకు పవన్ కళ్యాణ్ తోనే అన్నావు... గతంలో రాజకీయాల్లో ఉంటే వైఎస్ఆర్ సీపీలోనే ఉంటానన్నావు.. ఊసరవిల్లి కంటే వేగంగా మాటలు మారుస్తున్నావు. నువ్వేమో పవన్ తోనే ఉంటానని అంటున్నావు... పవన్ మాత్రం చంద్రబాబు తోనే ఉంటానంటాడు. నువ్వేమో గతంలో ఒంగోలులో టీడీపీని నామరూపాలు లేకుండా చేస్తానని అన్నావు. ఇంతకీ ఏం చేయబోతున్నావు. రాజకీయాలు చేస్తావా లేక పిఠాపురం సభలో చెప్పినట్లు పవన్ తో సినిమా తీసుకుంటావా'' అని ప్రశ్నించారు.


ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తున్న ఈఓ, ఉత్సవ కమిటీ సభ్యులు


గోవింద నామస్మరణతో కళ్యాణం తిలకిస్తున్న భక్తులు

నయనానందం.. భక్తిరస రమ్యం

● వైభవంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి కల్యాణం

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మీ అలివేలు మంగ సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం తెల్లవారు జామున వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు, కిక్కిరిసిన భక్తజన సందోహం నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డిల పర్యవేక్షణలో ఉభయదాతలు శ్రీవారికి పసిడి, రజిత ఆభరణాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. వేద పండితులు భార్గవాచార్యులు, ప్రసాదాచార్యులు, పవన్‌కుమార్‌శర్మ, తిరుమలాచార్యులు కల్యాణ ఘట్టాన్ని జరిపించారు. కల్యాణ వ్యాఖ్యాతగా తాల్లూరి దుర్గా వెంకటేశ్వరరావు వ్యవహరించారు. కల్యాణాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలతో పాటు ఒంగోలు, మార్కాపురం, విజయవాడ, తెనాలి, చీరాల, వినుకొండ, నంద్యాల, హైదరాబాద్ ప్రాంతాల నుంచి భక్తులు కల్యాణంలో పాల్గొన్నారు. కల్యాణ ఉభయదాతలుగా వాగిచెర్ల, జూటూరి, మూర్తి, తాడి కుటుంబ సభ్యులు, ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, కమిటీ సభ్యులు కుందురు కాశిరెడ్డి దంపతులు వ్యవహరించి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

శ్రీవారికి ముత్యాల తలంబ్రాలు:
భక్తులు సమర్పించిన ముత్యాలతో స్వామివార్లకు వేదపండితులు, ఉభయదాతలు స్వామివారికి ముత్యాలతో తలంబ్రాలు పోశారు. తొలుత తాడివారిపల్లికి చెందిన తాడివారు కత్తులు కటార్లతో ఆచారం ప్రకారం గుర్రాల మీద ఉత్సవంగా ఆలయం వద్దకు వచ్చారు. కల్యాణానికి ముందు స్వామి వార్లకు రాయబార మండపం వద్ద నిశ్చితార్థ రాయబార ఘట్టం నిర్వహించారు. రాయబార ఘట్టాలు ఛలోక్తిగా జరిగాయి. కల్యాణం అనంతరం మహిళలకు ముత్యాల తలంబ్రాలను, తీర్థ ప్రసాదాలు, లాటరీ ద్వారా 10 మంది మహిళా భక్తులకు చీరలు అందజేశారు. ఉదయం అల్పాహారాన్ని బ్రాహ్మణ అన్నదాన సత్రం కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

బై బై..!






ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు శనివారంతో పరీక్షలు ముగిసాయి. ఒంగోలులోని పరీక్ష కేంద్రాల్లో చివరి పరీక్ష రాసి బయటకు రాగానే ఇన్నాళ్లూ పడిన టెన్షన్‌కు స్వస్తి పలుకుతూ విద్యార్థులంతా ఎగిరి గంతేశారు. ఎంతో ఆనందంగా హాస్టళ్లకు చేరి సామగ్రి సర్దుకుని తల్లిదండ్రులతో కలిసి స్వగ్రామాలకు బయలుదేరి వెళ్లారు. సెల్ఫీలు దిగి ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు.

\- సాక్షి, ఒంగోలు








జిల్లాలో వైఎస్సార్ సీపీని నాశనం చేసిన ఘనత బాలినేనిది


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాదాసి వెంకయ్య, పక్కన చుండూరు రవిబాబు, లంకపోతు అంజిరెడ్డి, కఠారి శంకర్‌రావు, తదితరులు

● పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మాదాసి వెంకయ్య

ఒంగోలు టౌన్: జిల్లాలో ప్రతి నియోజకవర్గంలోనూ నాయకుల మధ్య చిచ్చుపెట్టి గ్రూపులు కట్టించి వైఎస్సార్ సీపీ ఓటమి చెందడానికి బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రధాన కారణమని పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మాదాసి వెంకయ్య విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు వైఎస్ జగనన్నను కలవకుండా అడ్డుకున్నారన్నారు. బాలినేని పార్టీకి దూరమైన తర్వాత ఈ 9 నెలల కాలంలో తాను పదిసార్లు జగనన్నను కలిసి మాట్లాడానని చెప్పారు. వైఎస్సార్ సీపీలో బాలినేనికి ఎంతో ప్రాధాన్యత, గౌరవం ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు జనసేనలో 250 మందిలో ఎక్కడో వెనక కూర్చోవాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ఎమ్మెల్సీ తీసుకుని మంత్రి అయ్యాకనే ఒంగోలు వస్తానని బాలినేని చెబుతున్నాడని, ఈ లెక్కన ఆయన ఎప్పటికీ ఒంగోలు రాలేడని వ్యాఖ్యానించారు. విలేకరుల సమావేశంలో కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్‌రావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు భూమిరెడ్డి రవణమ్మ, మహిళా నాయకురాలు షేక్ అఫ్సర్, నగరపాలక సంస్థ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్‌ఖాన్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మలిశెట్టి దేవ, మైనార్టీ నాయకులు షేక్ మీరావలి, షేక్ నాగూర్, తాతా నరసింహగౌడ్, బత్తుల ప్రమీల, వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండలో శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరునాళ్ల సందర్భంగా ఈ నెల 21, 22, 23 తేదీల్లో మూడు రోజుల పాటు జాతీయ స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు దేవస్థాన ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డి, సభ్యులు జవ్వాజి బాషాపతినాయుడు, మేకలవారిపల్లి రెడ్ల సంఘ సభ్యులు తెలిపారు. 21వ తేదీ ఆరు పండ్ల సైజు విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. 22, 23 తేదీల్లో న్యూ కేటగిరి, సీనియర్ విభాగాలలో పోటీలు ఉంటాయన్నారు. ఆరు పళ్ల సైజు విభాగంలో గెలుపొందిన ఎడ్లకు మొదటి ఆరు బహుమతులుగా వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు అందజేస్తామన్నారు. న్యూ కేటగిరీలో గెలుపొందిన ఎడ్లకు మొదటి ఆరు బహుమతులుగా రూ.70 వేలు, రూ.50 వేలు, రూ.35 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు అందజేస్తామన్నారు. సీనియర్ విభాగంలో గెలుపొందిన ఎడ్లకు మొదటి ఆరు బహుమతులుగా వరుసగా రూ.80 వేలు, రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలను దాతల సహకారంతో అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఎడ్ల జతకు రూ.5 వేల చొప్పున కాసు చారిటబుల్ ట్రస్టు తరఫున నగదు బహుమతి ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే ఎడ్ల యజమానులు ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 8008716521, 9505345703, 9963429928, 9581137317 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

400 ఏళ్లనాటి చింతచెట్టుకు నిప్పు


కాలిపోతున్న పురాతన చింతచెట్టు

రాచర్ల: శతాబ్దాల నాటి చింతచెట్టుకు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయి కూలిపోయింది. రాచర్ల మండలంలోని అనుమలవీడు గ్రామంలో చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాల్లోకి వెళ్తే.. అనుమలవీడు గ్రామానికి చెందిన షేక్ పల్నాటి గౌస్ అహమ్మద్ నల్లరేగడి పొలంలో ఉన్న 400 సంవత్సరాల కాలంనాటి చింతచెట్టుకు శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో ఆ చెట్టు పూర్తిగా కాలిపోయి కూలిపోయింది. 50 ఎకరాల గల నల్లరేగడి పొలాల రైతులు వచ్చి ఈ చెట్టుకింద కూర్చుని కొంత సమయం సేదతీరేవారు. ప్రస్తుతం వేసవి ప్రారంభమై ఎండలు పెరుగుతున్న సమయంలో చెట్టుకు నిప్పుపెట్టి కూల్చడంపై రైతులు, పశుపోషకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లారీ ఢీకొని ఒక వ్యక్తి, ఐదు గొర్రెలు మృతి

● మరొకరికి తీవ్రగాయాలు


సంఘటన స్థలంలో మృతదేహం, (ఇన్‌సెట్‌లో) రాములునాయక్

పుల్లలచెరువు: జీవాలను మేపుకుంటున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో అతనితో పాటు ఐదు గొర్రెలు మృతి చెందాయి. పుల్లలచెరువు మండలంలోని నరజాములతండాకు చెందిన పి.రాములు నాయక్ (45) తనకున్న జీవాలను మేపుకుంటూ శనివారం తెల్లవారుజామున 565వ నంబర్ జాతీయ రహదారిపై మల్లాపాలెం వద్దకు వచ్చాడు. ఆ సమయంలో మాచర్ల నుంచి యర్రగొండపాలెం వస్తున్న లారీ గొర్రెల మందపైగా దూసుకుపోవడంతో ఐదు గొర్రెలతో పాటు రాములునాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాములునాయక్‌కు ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు. పిల్లలిద్దరూ దివ్యాంగులు కాగా, బంధువులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని భోరున విలపించారు. వారి ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది. మృతిచెందిన గొర్రెల విలువ దాదాపు రూ.1.50 లక్షలు విలువ ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సంపత్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సత్తా చాటిన రాచర్ల మండలం ఎడ్లు


పోటీల్లో బండ లాగుతున్న ఎడ్లు

గిద్దలూరు రూరల్: మండలంలోని నరవ గ్రామంలో లక్ష్మీ నరసింహ స్వామి తిరునాళ్ల సందర్భంగా శనివారం నిర్వహించిన జాతీయ స్థాయి రెండు పండ్ల ఎడ్ల పోటీల్లో గిద్దలూరు నియోజకవర్గం రాచర్ల మండలానికి చెందిన ఎడ్లు సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచాయి. రాచర్ల మండలం ఆకవీడుకు చెందిన విజయలక్ష్మి నాయుడు ఎడ్లు 4104 అడుగులు లాగి మొదటి బహుమతి కింద రూ.25 వేలు, గిద్దలూరు మండలం ముండ్లపాడు గ్రామానికి చెందిన కంచర్ల తనిష్‌కుమార్ ఎడ్లు 3779 అడుగులు లాగి రెండో బహుమతి రూ.20 వేలను దక్కించుకున్నాయి. వైఎస్సార్ జిల్లా కాశినాయన మండలం వెంకట చైతన్యకుమార్ ఎడ్లు 3739 అడుగులు లాగి మూడో బహుమతి రూ.15 వేలు, రాచర్ల మండలం ఆకవీడుకు చెందిన విజయలక్ష్మీనాయుడు ఎడ్లు 3721 అడుగులు లాగి నాల్గవ బహుమతి రూ.10 వేలు, గిద్దలూరు మండలం బురుజుపల్లెకు చెందిన బాలవెంకటరెడ్డి ఎడ్లు 3660 అడుగులు లాగి ఐదో బహుమతి రూ.7 వేలు, నంద్యాల జిల్లా సింగవరం గ్రామానికి చెందిన జమాల్ బాష ఎడ్లు 3642 అడుగులు దూరం లాగి ఆరో బహుమతి రూ.5 వేలను, నంద్యాలకు చెందిన జయమ్మ ఎడ్లు 3375 అడుగుల దూరం లాగి 7 వ బహుమతి రూ.3 వేలను దక్కించుకున్నాయి. ఈ పోటీల్లో మొత్తం 26 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఎడ్ల పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 16 వ తేదిన సీనియర్ విభాగం ఎడ్లకు పోటీలు నిర్వహించననున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి బండి శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాండురంగారెడ్డి, వెంకటస్వామి, నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రానైట్ పరిశ్రమలో ఉరి వేసుకుని యువకుడు మృతి

చీమకుర్తి రూరల్: గ్రానైట్ పరిశ్రమలో ఉరి వేసుకుని యువకుడు మృతిచెందిన సంఘటన చీమకుర్తి మండలంలోని కమ్మంపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. సీఐ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సమీర్ మనస్తాపంతో ఉరి వేసుకుని మృతి చెందాడు. శనివారం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.